సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



ప్రజలకు ఆరోగ్య సురక్ష..!
వైద్య రంగంలో మరో బృహత్తర పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కార్యక్రమం ప్రారంభం కానుంది. -8లో..



సద్బుద్ధితో.. సంకల్ప్‌సిద్ధి
కడప గడ్డ వేదికగా ఐఐటీ, నీట్‌లలో ర్యాంకుల పంట పండిస్తున్నాడు. తన 'సంకల్ప్'బలంతో విద్యార్థులను లక్ష్యం వైపు నడిపిస్తున్న ఓ విజేత స్ఫూర్తిగాథే నేటి 'సాక్షి' ప్రత్యేక కథనం. -8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.1/24.8
జిల్లాలో శుక్రవారం 24.8 - 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. చక్రాయపేటలో అత్యధికంగా 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజుపాలెంలో 22.4 , దువ్వూరులో 18.2, ముద్దనూరులో 17.6, చాపాడులో 5.4, ఎర్రగుంట్లలో 4.6, వేములలో 3, వేంపల్లిలో 3.2, ఆట్లూరులో 2.6, ఒంటిమిట్టలో 1,6 గోపవరంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

1లోగా అభ్యంతరాలు తెలపాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 32 భవిత రిసోర్స్ పర్సన్ల నియామకానికి సంబంధించిన మెరిట్ జాబితాలో అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 1వ తేదీలోగా తెలియజేయాలని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3 నుంచి 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని, దీనికి సంబంధించిన సమాచారం సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. అభ్యంతరాలను సమగ్రశిక్ష అభియాన్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయన్ని లెక్కిస్తున్న భక్తులు

వీరపునాయునిపల్లె: మండలంలోని సంగమేశ్వరుని ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 9నెలలకు సంబంధించి రూ.2,79,174 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమచేశామన్నారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సొరంగ మార్గం..
స్వర్గతుల్యం

- అద్భుతంగా రూపుదిద్దుకున్న ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వేలైన్
- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టన్నెల్ లైన్‌గా గుర్తింపు
- న్యూ ఆస్ట్రేలియన్ మెథడ్‌తో నిర్మాణం
- కోస్తాకారిడార్, రాయలసీమకు అనుసంధానం
- విజయవాడ, విశాఖపట్నం తదితర నగరాలకు సులువైన మార్గం



ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వే మార్గం (ఇన్‌సెట్) సొరంగ మార్గం

సాక్షి ప్రతినిధి కడప: రాయలసీమ-కోస్తా జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ పెరిగేందుకు అరుదైన రైల్వే మార్గం..ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వేలైన్. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద టన్నెల్ ఏర్పాటు చేసి దీనిని నిర్మించారు. న్యూ ఆస్ట్రేలియన్ టన్నెల్ మెథడ్‌తో సాంకేతిక పనులు పూర్తి చేశారు. వెలుగొండ అడవుల్లో 7.560 కిలోమీటర్ల పొడవైన టన్నెల్‌ను ఈ మార్గం కోసం ఏర్పాటు చేశారు. దీంతో ఓబులవారిపల్లె-కృష్ణపట్నం మార్గంలో గూడ్స్ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. అద్భుతమైన ఈ లైన్‌లో ప్రయాణికుల కోసం రైళ్లు నడిపితే విజయవాడ, విశాఖపట్నం తదితర కోస్తా జిల్లాలకు కనెక్టివిటీ బాగా పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి అందాల నడుమ కాశ్మీర్ తరహాలో ఏర్పాటు చేసిన ఈ మార్గం గుండా ప్రయాణం మరువురాని అనుభూతినిస్తుంది.

ఎగుమతుల కోసం..

ఈ రైలు మార్గాన్ని ఎస్ఆర్ఎస్‌పీ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఓడరేవు నుంచి పలు రకాలైన ఖనిజాలను ఎగుమతి చేసేందుకు ఏర్పాటు చేశారు. ఏపీఎండీసీ పరిధిలో మంగంపేట నుంచి బెరైటీస్, బళ్లారి నుంచి ఐరన్ ఓర్ కూడా ఇదే మార్గంలో వెళుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నూతనంగా ఈ మార్గంలో 35 కిలోమీటర్లు, నెల్లూరుజిల్లాలో 58 కిలోమీటర్ల మేర నిర్మించారు. ఈ నడుమ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మంగంపేట, నేతివారిపల్లె, చెర్లోపల్లె రైల్వేస్టేషన్లుండగా..నెల్లూరు జిల్లాలో ఎనిమిది స్టేషన్ల ద్వారా గూడ్స్ రైళ్లు కృష్ణపట్నం చేరుకుంటున్నాయి.

రూ.470 కోట్లతో టన్నెల్..

ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వే లైన్ ఏర్పాటుకు 7.56 కిలోమీటర్ల టన్నెల్ ఏర్పాటు చేశారు. న్యూ ఆస్ట్రేలియన్ టన్నెల్ మెథడ్‌తో సాంకేతికపనులు చేపట్టారు. స్కాట్‌లాండ్ మిషనరీతో నిర్మించారు. పెనుశిల అభయారణ్యం కొండల్లో ఈ నిర్మాణం జరిగింది. 2006లో అప్పటి రైల్వేశాఖ మంత్రి నితీశ్‌కుమార్ రైల్వేలైన్‌కు పచ్చ జెండా ఊపారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చొరవ కారణంగా సకాలంలో భూసేకరణ, పర్యావరణ అనుమతులు లభించాయి. రూ.1646 కోట్లతో ఈమార్గం రూపుదిద్దుకుంది. రెండు గుహల మధ్య పచ్చని లోగిళ్లలో రైల్వే లైన్ వెళుతుంది. చుట్టూ కొండలు, పెనుశిల అభయారణ్యం మధ్యన టన్నెల్‌లో రైల్వే ప్రయాణం అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ రైల్వే మార్గాన్ని ఉపరాష్ట్రపతి హోదాలో 2019 సెప్టెంబర్, 1వ తేదీన ఎం.వెంకయ్యనాయుడు జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి కృష్ణపట్నం పోర్టుకు గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి.

కనెక్టివిటీకి సులువు

కడప-విజయవాడ మధ్య రైల్వే రాకపోకలు చాలా అరుదుగా ఉన్నాయి. కడప నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్(కడప-విశాఖపట్నం).. యర్రగుంట్ల, ప్రొద్దుటూరుల నుంచి ధర్మవరం-విజయవాడ రైళ్ల ద్వారా ప్రయాణం చేయాల్సి ఉంది. లేకపోతే తిరుపతి, రేణిగుంటల నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అయితే నేరుగా కడప నుంచి విజయవాడకు ప్రత్యేకించి రైళ్లు లేవు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి నిత్యం వేలాది మంది విజయవాడకు వెళ్తున్నారు. ప్రత్యేకించి అక్కడి ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఇక్కడి విద్యార్థులు దాదాపు 20వేల మంది వరకు విద్యను అభ్యసిస్తున్నారు. పేరెంట్స్ రాకపోకలు సాగించేందుకు ఈ మార్గం ఉపయోగపడనుంది. కడప, రాజంపేట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ వెళ్లేందుకు ఈ మార్గం సులభతరంగా ఉంటుందని రైల్వే నిపుణులు వివరిస్తున్నారు.

ఎంతో ఉపయోగకరం



ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వే మార్గం గుండా రైళ్ల రాకపోకలు నిర్వహిస్తే ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు ఎంతో ఉపయోగకరం. రైల్వే బోర్డు దృష్టికి విషయాన్ని తీసుకెళ్తాం.
- తల్లం భరత్‌కుమార్‌రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్

పంట ఉత్పత్తులు రవాణా చేసుకోవచ్చు



ఈ రైలు మార్గం గుండా రాకపోకలు నిర్వహిస్తే ప్రయాణికులకు వెసులుబాటు లభిస్తుంది. నిత్యం వేలాది మంది విజయవాడకు ప్రయాణాలు సాగిస్తున్నారు. పంట ఉత్పత్తులు ఎగుమతి చేసుకోవడానికి ఉపయో గకరమే.
- శంకర్‌రెడ్డి, నాగవరం, చిట్వేలి

సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

బద్వేలు అర్బన్ : సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని మండల స్థాయిలోనే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీ, మండల పరిధిలో 190 పైచిలుకు అర్జీలు రాగా కొన్నింటికి అప్పటికప్పుడు పరిష్కారం చూపారు.

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక

'జగనన్నకు చెబుదాం స్పందన' వల్ల సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక లభించినట్లైందని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.జేసీ గణేష్‌కుమార్, ఆర్డీఓ వెంకటరమణ, ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు.

రహదారుల భద్రత.. సామాజిక బాధ్యత

కడప సెవెన్‌రోడ్స్ : రహదారుల భద్రత ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. . శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ చాలామంది రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జనాభాతోపాటు వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రవాణా, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై దృష్టి సారించాలన్నారు.

- పేదల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాటుపడుతోందని కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతినెల జరిగే ' స్పందన'లో మొదటి గంటలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామన్నారు.
- ఈ నెల 30న జిల్లాలో ప్రారంభం కానున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఉచిత వైద్య సేవా కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

'వాహనమిత్ర'తో ఆర్థిక భద్రత



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు

● డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర పేరిట ఆటో, ట్యాక్సీ వాహనదారులకు అందిస్తున్న సాయంతో ఆర్థిక భద్రత ఏర్పడిందని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వైఎస్సార్ వాహనమిత్ర ఐదో ఏడాది లబ్ధి మొత్తాన్ని బటన్‌నొక్కి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో, ఉప రవాణాధికారి మీరా ప్రసాద్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మి, టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, విజయకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం డీఆర్వో జిల్లాలోని 11,094 మంది ఆటో, ట్యాక్సీ ఓనర్లకు మంజూరైన రూ. 11,09,40,000ల మెగా చెక్కును అందజేశారు. అనంతరండీఆర్వో మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్, బీమా, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ప్రతి యేటా ప్రభుత్వం లబ్ధిదారులకు రూ. 10 వేల ఆర్థికసాయం అందిస్తోందన్నారు.

క్లుప్తంగా

ఈ సర్వేయర్ మాకు వద్దు
– సచివాలయం వద్ద రైతుల ధర్నా



తహసీల్దార్ సువర్ణకు వినతి పత్రం ఇస్తున్న బాధితుడు మల్లేశ్వర్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు సచివాలయ సర్వేయర్ జి.సునీల్ మాకు వద్దంటూ ఆరోపిస్తూ రైతు మల్లేశ్వర రెడ్డి, తదితరులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక రైతులతో కలిసి సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాగిరెడ్డి మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ బూదవాడ, దిగువనేలటూరు మధ్య పొలానికి దారి చూపాలని ఆరు నెలలుగా సర్వేయర్‌ను కోరుతున్నట్లు తెలిపారు. రూ.50 వేలు ఇస్తే అన్నీ చూసుకుంటానని చెప్పి రూ.35 వేలు తీసుకున్నారని ఆరోపించారు. గత బుధవారం రమ్మని చెప్పి.. రాగానే సెలవు రోజు ఎందుకు వచ్చావంటూ తనపై దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బాధితులు 20 మంది ఉన్నారని, వారంతా ఎవరికీ విషయం చెప్పుకోలేక సచివాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి తక్షణమే ఆయనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారు సువర్ణ, డీటీ జాన్సన్, ఎస్‌ఐ విద్యాసాగర్ సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

నాటు బాంబు స్వాధీనం
– సంఘటనా స్థలంలో డీఎస్పీ, బాంబు స్క్వాడ్ తనిఖీలు

జమ్మలమడుగు : పట్టణంలోని ముద్దనూరు రహదారిలోని వెంచర్‌లో శుక్రవారం నాటుబాంబు కలకలం రేపింది. బాంబును గుర్తించిన వెంచర్ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ నాగరాజు, సీఐ సదాశివయ్య ఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బందితో వచ్చి నాటుబాంబును స్వాధీనం చేసుకున్నారు. 2019 జూన్‌లో ఇదే స్థలంలో వెంచర్ యజమాని భూమిని చదును చేస్తుండగా నాటు బాంబు కనిపించింది. పోలీసులు రంగప్రవేశం చేసి 53 నాటు బాంబులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆదే స్థలంలో మరో నాటు బాంబు దొరికింది. అప్పట్లో సక్రమంగా పరిశీలించకపోవడంతో ఒక నాటుబాంబు ఉండిపోయి ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం బాంబు స్క్వాడ్‌తో చుట్టుపక్కలా తనిఖీలు చేయించగా ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని సీఐ సదాశివయ్య పేర్కొన్నారు.



బస్సుల్లో టిక్కెట్ ధర తగ్గింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డిపో నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డాల్ఫిన్ ఏసీ బస్సుల్లో టిక్కెట్ ధరను 15 శాతం తగ్గించామని డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఒకేసారి రానూ, పోనూ రిజర్వేషన్ చేసుకుంటే టిక్కెట్‌పై 40 శాతం తగ్గింపు ఇస్తామన్నారు. కడప నుంచి ఎంజీబీఎస్‌కు రూ.1213, బీహెచ్‌ఈఎల్‌కు రూ.1265 టిక్కెట్ ధర ఉందన్నారు. 15 శాతం తగ్గింపుతో ఎంజీబీఎస్‌కు రూ.1074, బీహెచ్‌ఈఎల్‌కు రూ.1120 ఉంటుందన్నారు.

సద్బుద్ధితో.. సంకల్ప్‌ సిద్ధి

పదిలో ప్రత్యేకత చాటాలంటే పుట్టిన ఊరు వదలాలి. ఇంటర్‌లో విన్నర్ కావాలంటే ఇంటి నుంచి దూరంగా పోవాలి. ఇక.. ఐఐటీ సీటు రావాలంటే అయినవారిని వీడాల్సిందే. నీట్‌లో ర్యాంకు రావాలంటే నిలుచున్నచోటును మరిచిపోవాల్సిందే. ఇదీ నిన్నా మొన్నటివరకు రాయలసీమ విద్యార్థుల పరిస్థితి. అవును.. ప్రతిభ ఉన్నా సానబెట్టేవారు దొరకని దుస్థితి. పట్టుదల ఉన్నా పెద్దపట్టణాలకు వెళ్లలేని ఆర్థికస్థితి. ఇలాంటి తరుణంలో ఓ యువకుడు తన సద్బుద్ధితో వీరికి సరికొత్త మార్గాన్ని చూపాడు. రాళ్లసీమ నుంచి రత్నాల్లాంటి విద్యార్థులను వెలికితీస్తున్నాడు. కడప గడ్డ వేదికగా ఐఐటీ, నీట్‌లలో ర్యాంకుల పంట పండిస్తున్నాడు. తన 'సంకల్ప్'బలంతో కార్పొరేట్ శక్తులకు సవాల్ విసురుతున్నాడు. విద్యార్థుల సామర్థ్యానికి తన శక్తి జోడించి లక్ష్యం వైపు నడిపిస్తున్న ఓ విజేత స్ఫూర్తిగాథే నేటి 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఐఐటీ, నీట్‌లలో ర్యాంకుల పంట
- కరువు సీమలో విద్యాసౌరభం
- క్రమశిక్షణతో ఉత్తమ బోధన



సంకల్ప్‌లో తరగతులకు హాజరైన బాలికలు, విజయసూచిక చూపుతున్న వంశీకృష్ణ(ఇన్‌సెట్‌లో)

సాక్షి, కడప డెస్క్: 'విజయం కోసం ఆరాటపడితే సరిపోదు.. జీవితంలో ఎదగాలని ఆశపడితే చాలదు.. మనసా వాచా కర్మణా ఆచరించాలి.. అలా చేయకుంటే ఎంత ఉన్నతాశయమైనా భూమిలో నాటని విత్తనంతో సమానమే.. అది మొలకెత్తదు.. ఆ ఆశయమూ ఫలించదు..' అంటూ విద్యార్థులకు స్ఫూర్తిమంత్రం నూరిపోస్తుంటాడు వంశీకృష్ణ. వెనుకబడిన సీమ విద్యార్థుల భవితకు దీపధారై నడుస్తున్న ఆయన పుష్కరం క్రితం కడపకు వచ్చాడు.

లాభాపేక్ష లేకుండా...

2011లో వైఎస్సార్ జిల్లా కేంద్రంలో నాగార్జున మోడల్ స్కూల్ కేంద్రంగా 'సంకల్ప్' స్థాపించాడు. అప్పటి నుంచి ఎందరో విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నారు. అటుతర్వాత ఏపీహెచ్‌బీ కాలనీలో దశాబ్దం కిందట 'సంకల్ప్' పేరిట ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేశాడు వంశీకృష్ణ. అయినా 'నాగార్జున'తో అనుబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. డబ్బు సంపాదన లక్ష్యంగా కాకుండా సేవాదృక్పథంతో ఇస్తున్న ఆయన శిక్షణతో ఎంతోమంది ఉజ్వల భవిష్యత్ పొందారు.

పకడ్బందీగా ప్రవేశపరీక్ష

'సంకల్ప్'లో ప్రవేశాల కోసం బేసిక్ మ్యాథమేటిక్స్ విధానం ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. నాలుగో తరగతి ముగించి ఐదో తరగతిలో చేరబోయే విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులు. పదో తరగతి వరకు శిక్షణ కొనసాగుతుంది. ఏటేటా నిర్వహించే ప్రవేశ పరీక్షలకు సీమ జిల్లాల నుంచి విద్యార్థులు వెల్లువలా వస్తారు. ఇక్కడ చేరితే ఐఐటీలో కచ్చితంగా సీటు వస్తుందనే నమ్మకమే ఇందుకు కారణం. పరీక్షల్లో అర్హత సాధించిన వంద మందికే ఇక్కడ అవకాశం కల్పిస్తారు.

ఆలోచనే ఆయుధం

సంకల్ప్‌లో మొత్తం సిలబస్‌ను వేగంగా బోధించరు. విద్యార్థి ఆలోచనా విధానం, స్వతహాగా చొరవను గుర్తిస్తారు. ఉపాధ్యాయులపై ఆధారపడకుండా సొంతంగా సబ్జెక్ట్ అర్థం చేసుకుని చదివేలా తర్ఫీదు ఇస్తారు. నిత్యం ఏదో ఒక టాపిక్ చెబుతారు. అది నేర్చుకున్న విద్యార్థి సొంతంగా దానిపై ఒక్క నిమిషం మాట్లాడాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రత్యేక తరహా శిక్షణతో వారు రాటుదేలుతారు.

ప్రశ్నించడం నేర్పుతూ..

సంస్థలో ప్రతి విషయంలో ఎందుకు? ఏమిటి? ఎలా? అంటూ ప్రశ్నించడం అలవరుస్తున్నారు. మూస పద్ధతిలో బోధన కాకుండా విద్యార్థికి న్యూమరికల్ ప్రాబ్లం ఇచ్చి ఎన్ని పద్ధతుల్లో సాల్వ్ చేస్తారంటూ అడుగుతారు. చాలామంది మూడు పద్ధతుల్లో సాల్వ్ చేస్తారు. కొందరు అంతకంటే ఎక్కువ పద్ధతుల్లో పరిష్కరిస్తారు. ఈ క్రమంలోనే ఓ విద్యార్థి తొమ్మిది పద్ధతుల్లో సాల్వ్ చేయడం విశేషం. చిన్నారుల ఆలోచనలను సరైన దారిలో పెడితే ఇలాంటి అద్భుతాలు సాధ్యమంటాడు వంశీ.

మామయ్య సలహాతో..

వంశీకృష్ణ మేనమామ రాజకీయ, సామాజిక అంశాల విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్. సంకల్ప్ స్థాపించాలనే తన ఆలోచనను ఆయనకు వివరించారు. వెనుకబడిన ప్రాంతాలకు ఉప యోగపడేలా సంస్థ ఉండాలని, రాయలసీమ అందుకు అనుగుణంగా ఉంటుందని నాగేశ్వర్ సలహా ఇచ్చారు. దీంతో రాయలసీమ నడిబొడ్డునున్న కడపలో సంస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



మామయ్య నాగేశ్వర్‌తో వంశీ కుటుంబ సభ్యులు

ఉత్తర తెలంగాణ నుంచి..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓదేడుకు చెందిన సత్యనారాయణ, పద్మ దంపతుల కుమారుడు చకిలం వంశీకృష్ణ. ఓదేడు, మంథని, వరంగల్‌లో ఈయన బాల్యం గడిచింది. అక్కడే ప్రాథమికస్థాయి నుంచి డిగ్రీ వరకు చదువు పూర్తి చేశాడు. ఫిజిక్స్‌లో పీజీ చేసిన ఆయన ఐఐటీ, జేఈఈ లెక్చరర్‌గా కోటా(రాజస్థాన్), ఢిల్లీ తదితర ప్రాంతాల్లో పని చేశాడు. ఐఐటీ రామయ్య, సూపర్ థర్టీ ఆనంద్ కుమార్‌ల నుంచి స్ఫూర్తి పొందాడు. వెనుకబడిన ప్రాంతాలకు ఏదైనా చేయాలనే ఆలోచన అక్కడే మొదలైంది. కెమిస్ట్రీ లెక్చరర్ చకిలం రేణుకతో వివాహమైన అనంతరం 'సంకల్ప్' స్థాపనకు బీజం పడింది.

ర్యాంకులకు సూచిక

భావిభారతానికి సేవ చేయాలనే లక్ష్యంతో తన శిష్యులను డాక్టర్లు, ఇంజినీర్లుగా.. సమాజానికి ఉపయోగపడే ఉన్నతాశయాలు కలిగినవారిగా తయారు చేస్తున్నాడు వంశీ. ప్రతీ పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందనే నానుడిని నిజం చేస్తున్నారు ఆయన భార్య రేణుక. కెమిస్ట్రీ బోధకురాలైన ఆమె 'సంకల్ప్'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే 'సంకల్ప్' ఘనత తమతో పాటు సహోపాధ్యాయులది కూడా అంటున్నాడు వంశీకృష్ణ. అందరి సమష్టికృషితోనే ఘనమైన ఫలితాలు సాధిస్తున్నామంటున్నాడు. ఆయన వద్ద చదివిన చాలామంది విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కంపెనీల్లో రూ. లక్షల్లో గడిస్తున్నారు. ఎంతోమంది ఇంజినీర్లు, డాక్టర్లుగానే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లుగా కూడా స్థిరపడ్డారు. ఈ ఏడాది ప్రణతిరెడ్డి అనే విద్యార్థిని నీట్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 45వ ర్యాంకు సాధించడం 'సంకల్ప్' సాధనకు గీటురాయిగా నిలిచింది. పదుల సంఖ్యలో ఐఐటీ, మెడికల్ సీట్లు సాధించడం గర్వకారణమైంది. తమ సంస్థలో ఏటా పది మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడమేగాక కార్పొరేట్ కళాశాలలో చదివిస్తున్నాడు వంశీకృష్ణ. భవిష్యత్తులో అనాథ పిల్లలకు శిక్షణను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమంటున్నారాయన.

సెల్ఫ్ లెర్నింగ్ అత్యావశ్యకం



ఐఐటీల్లో ఇంజినీరింగ్ చేసే విద్యార్థులకు సెల్ఫ్ లెర్నింగ్ చాలా అవసరం. అందుకే మా వద్ద వారిని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నాం. విద్యార్థులకు మాస్టర్ టాస్క్ ఇచ్చి అదే పద్ధతుల్లో ప్రశ్నలు క్రియేట్ చేయమని చెబుతాం. వారి విశ్లేషణ శక్తి పెంచుతాం. ఇష్టంలో కష్టపడే వాతావరణం ఉండేలా చూస్తాం. – వంశీ, సంకల్ప్ సంస్థ

సీమవాసుల అదృష్టం



కడపలో ఇన్‌స్టిట్యూట్ పెట్టడం జిల్లావారికే కాదు సీమ వాసులకు సైతం అదృష్టంగా మారింది. విద్యార్థులు బరువుగా కాకుండా, బాధ్యతగా చదువుకోవడాన్ని నేర్పిస్తున్నారు. దీంతో మావాడు కేవీపీవై, మ్యాథ్స్ ఒలింపియాడ్, తదితర పరీక్షల్లో సైతం రాణించాడు. ఐఐటీలో 280 ర్యాంకుతో ఖరగ్ పూర్‌లో సీటు సాధించాడు. అమెజాన్‌లో సీనియర్స్ విభాగంలో ఇంటర్న్‌షిప్ సాధించాడు. – చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు

క్రమశిక్షణ నేర్పుతున్నారు



నా కుమారుడు శ్రీనందన్‌రెడ్డి, కుమార్తె హర్షిత సంకల్ప్‌లో చదివారు. బేసిక్స్‌తో పాటు పోటీప్రపంచానికి తగ్గట్టు తీర్చిదిద్దారు. ప్రాబ్లం సాల్వింగ్‌తో పాటు క్రమశిక్షణ నేర్పారు. దీంతో ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సులభమైంది. శ్రీనందన్ 2019 ఆల్ ఇండియా నీట్‌లో 42వ ర్యాంకు సాధించారు. హర్షిత కూడా మంచి ర్యాంకు సాధించింది. – ఎ.ప్రసూన, ప్రొఫెసర్, హోమియో మెడికల్ కళాశాల

ప్రజలకు ఆరోగ్య సురక్ష

నేటినుంచి వచ్చే నెలాఖరు వరకు వైద్యశిబిరాలు



సామాగ్రిని తరలిస్తున్న వైద్య సిబ్బంది (ఇన్‌సెట్) మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : వైద్య రంగంలో మరో బృహత్తర పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కార్యక్రమం ప్రారంభం కానుంది. అందులో భాగంగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.ఈ పథకం సన్నాహక కార్యక్రమాలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. తొలి దశలో వలంటీర్లు, రెండోదశలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల వివరాలపై ఆరా తీశారు. రోగుల వివరాలను నమోదు చేశారు. మెడికల్ క్యాంపుల వివరాలను తెలిపి, అక్కడ వైద్య పరీక్షలు పొందేలా చర్యలు చేపట్టారు.

నేడు 36 వైద్య శిబిరాలు....

జగనన్న ఆరోగ్య సురక్ష కింద శనివారం జిల్లా వ్యాప్తంగా కమలకూరు, తంగేడుపల్లి, రాజుపాలెం, గొండ్లవీడు, ఎస్ ఓబైనపల్లె, ఇడమడక-1, బేతాయపల్లె, చింతలపల్లె, బీ కొత్తపల్లె, పులివీడు, తువ్వపల్లె, కొండరాజుపల్లి, మార్లెమడక, పెద్దకూడాల, రాగిమానుపల్లి, బూచుపల్లి, ఉరుటూరు-2, కత్తలూరు, రసూల్‌పల్లి, దేవరాజుపల్లి, వెల్లటూరు, ఉప్పరపల్లె, మంటపంపల్లి, పొన్నతోట, చౌటపల్లె, పెనికలపాడు-2, బిస్తవేముల, జే కొత్తపల్లె, కామనూరు చౌటపల్లె, అరకట వేముల, నిడుజువ్వి డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ పరిధిలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి బద్వేల్ కోట స్ట్రీట్, మైదుకూరు లిగోరీ స్కూల్, కడప నాగరాజుపేట, ప్రొద్దుటూరు టీబీ రోడ్-2, యర్రగుంట్ల క్రాంతి నగర్‌లో మొత్తం 36 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

ప్రతి సచివాలయం పరిధిలో మెడికల్ క్యాంప్

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, పట్టణ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తారు. ఇందులో ముందుగానే గుర్తించిన రోగులకు వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటిని సందర్శిస్తారు. యంత్రాంగం నెలాఖరు వరకు వైద్య శిబిరాల నిర్వహిస్తారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి....

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ అవసరమైన వారికి ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తామని పేర్కొన్నారు. పెద్ద జబ్బులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు పొందడానికి నెట్ వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరాల్లో ఆరోగ్య శ్రీ సిబ్బంది కూడా పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డాక్టర్ శోభిభూషణ్, రమేష్ రెడ్డి, భారతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం



ఫోన్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ బస్సుల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ ఆర్‌ఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు వివరించారు. రాత్రి 10 గంటల తర్వాత ఖాజీపేట బస్టాండుకు బస్సులు రావడం లేదని, డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని, అధిక మంది కండక్టర్లు టిక్కెట్ వెనుక చిల్లర రాయగా.. ప్రయాణికులు మరిచి పోయి దిగి వెళ్తున్నారని ఫిర్యాదు చేశారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రాథమిక చికిత్స బాక్సులను ఏర్పాటు చేయాలని కోరారు. యూటీఎస్ టిమ్ముల ద్వారా నగదు రహిత టిక్కెట్లను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వికలాంగుల పాసుల జారీకి మార్గదర్శకాలు తెలిజేయాలని సూచించారు. కడప నుంచి పామూరుకు బస్సు ఏర్పాటు చేయాలని మరి కొందరు కోరారు. కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద, రైల్వే స్టేషన్ వద్ద బస్సుల రాకపోకల వివరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

బ్యాట్‌తో బాదేశారు



సెంచరీలు చేసిన రేవంత్‌రెడ్డి(నెల్లూరు), అర్జున్ టెండూల్కర్ (సౌత్‌జోన్), రాహుల్(నార్త్‌జోన్)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాట్స్‌మన్ సత్తా చాటారు. శుక్రవారం జరిగిన పోటీల్లో సౌత్‌జోన్, నెల్లూరు, కృష్ణా జట్లు గెలుపొందాయి. కడప వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ముందుగా సౌత్ జోన్, నార్త్ జోన్ జట్లు తల పడ్డాయి. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి సౌత్‌జోన్‌జట్టు 257 పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 103 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 49.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో ఎస్.వి.రాహుల్ 121 పరుగులు, విజయ్ 72 పరుగులు చేశారు.

నెల్లూరు జట్టు విజయం..

కేఓఆర్‌ఎం మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 321 పరుగులు చేసింది. రేవంత్‌రెడ్డి 109 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు 37 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌట్ అయింది. నెల్లూరు జట్టు 147 పరుగుల తేడాతో విజయం సాధించింది.

కృష్ణా జట్టు గెలుపు

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, కృష్ణా జట్లు తలపడ్డాయి. విజయనగరం జట్టు 47 ఓవర్లలో 159 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని దుర్గ 51 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 43.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసి విజయం సాధించింది.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



అర్బన్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

పులివెందుల : శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్, వేంపల్లె, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ, చక్రాయపేట, వేముల పోలీస్ స్టేషన్లను శుక్రవారాన్నాయన ఆకస్మిక తనిఖీ చేశారు. డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐలు గోవిందరెడ్డి, మద్దిలేటి, రాజులతో కేసులకు సంబంధించిన పలు విషయాలపై చర్చించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళల భద్రతకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. భూ కబ్జాలు, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పులివెందులలో హెలిప్యాడ్, ఏపీకార్ల్, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో పచ్చదనం చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఇడుపులపాయ వైయస్ఆర్ ఘాట్, ముఖ్యమంత్రి బస చేసే గెస్ట్ హౌస్, హెలిపాడ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు హుస్సేన్, సత్యనారాయణ, తిరుపాల్ నాయక్, ధనుంజయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలంలోని యర్రగుంట్ల-కమలాపురం రైల్వే స్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు యర్రగుంట్ల రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 65 సంవత్సరాలు ఉంటుందన్నారు.

3న స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

కడప స్పోర్ట్స్ : పులివెందుల ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు జిల్లాస్థాయి క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ తెలిపారు. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 3వ తేదీన బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి అక్టోబర్ 10 నుంచి 13వ తేదీ వరకు పులివెందుల స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్‌ను 6300664935 సంప్రదించాలని కోరారు.

బ్రహ్మంగారిమఠంలో ప్రముఖులు



ఆలయంలో సీఎండీ పద్మ జనార్ధన్‌రెడ్డి, తదితరులు

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామిని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దన్‌రెడ్డి, ఓఎస్‌డీ శ్రీనివాసులు శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ మేనేజర్ వారికి తీర్థ ప్రసాదాలు అందించి శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, పీఆర్ ఈఈ, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.21.10 లక్షలు

బ్రహ్మంగారిమఠం: పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం హుండీలోని కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.21,10,315 నగదు, 18 గ్రాముల బంగారం, 425 గ్రాముల వెండి వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. 45 రోజుల కాలంలో దేవస్థానం ఆవరణలో హుండీలలో సొమ్మును లెక్కించామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ, వెంకటాద్రి స్వామి, మహాలక్ష్మమ్మ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామికి రూ.12.14 లక్షల ఆదాయం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో హుండీని శుక్రవారం లెక్కించగా రూ.12,14,430లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. దేవధాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి శుక్రవారం వరకూ భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. గతేడాది రూ.10,04,880లు వచ్చిందని, ఈ ఏడాది రూ.2,09,550 ఆదాయం పెరిగిందని తెలిపారు.